## క్లుప్తంగా

### నేటి నుంచి సంగీత నృత్యోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలో శనివారం నుంచి సోమవారం వరకు రాయలసీమ సంగీత నృత్యోత్సవాలను శ్రీనటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం నాట్యగురువు మొహిద్దీన్ ఖాన్ తెలిపారు. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు పట్టణంలో రాయలసీమ సంగీత నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకలో రాయలసీమతో పాటు బళ్లారి తదితర ప్రాంతాలకు చెందిన 250 మందికిపైగా కళాకారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శన చేయనున్నారని తెలిపారు. పలువురికి రాయలసీమ సంగీతరత్న, నృత్యరత్న అవార్డులు ఈ సందర్భంగా ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఈ వేడుకల్లో కళాభిమానులు, కళాకారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

### పోషకాహారంతో తల్లీబిడ్డ క్షేమం



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : గర్భం దాల్చినప్పటి నుంచి సరైన ఆహారం తీసుకుంటే తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని జ్యోతి ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా, జ్యోతి ఆస్పత్రి వైద్యురాలు జ్యోతి ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 26 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 7 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు చంద్రకళ, వరప్రసాద్, గౌతమి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### బీసీలకు రాయితీ రుణాలు

అట్లూరు: బీసీ, ఈబీసీ వర్గాలకు ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలను మంజూరు చేయనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ బాబు శుక్రవారం పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి బీసీ, ఈబీసీ వర్గాలకు వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ సర్వీసులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు బ్యాంకు లింకేజీతో రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. అర్హులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు

అట్లూరు: రబీ సీజన్‌కు సంబంధించి రైతులు పండించే పంటల వివరాలను ఇ–క్రాప్ ద్వారా నమోదు చేయించుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలులోని వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో బద్వేలు, అట్లూరు, గోపవరం, సిద్దవటం మండలాల వ్యవసాయ అధికారులు, రైతు సేవాకేంద్రాల వ్యవసాయ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ యాజమాన్య పద్ధతుల ధ్రువీకరణ కోసం చేసిన 20 మంది రైతులకు అవసరమైన రసాయన ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు జి.రామకృష్ణయ్య, కె.చంద్రమోహన్ రెడ్డి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతి ఘటన బాధాకరం



నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల క్యూ కాంప్లెక్స్ తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధాకరమని పీఆర్ఆర్‌డీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. గోదావరి పుష్కరాల్లో 30 మంది మృతి చెందారని, అందుకు కారణం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని చెప్పారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : పట్టణ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీజీ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ ప్రొద్దుటూరు సబ్‌స్టేషన్, వివిధ 11కేవీ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ పనుల కోసం విద్యుత్‌ను నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

# వైకుంఠ దర్శనం.. పోటెత్తిన భక్తజనం

ముక్కోటి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్తర ద్వారంలో నారాయణుడిని చూసి భక్తకోటి పరవశించింది. వైష్ణవాలయాలు గోవిందనామ స్మరణతో మార్మోగాయి. ఈ రోజు మహా విష్ణువును దర్శించుకుంటే వైకుంఠం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో ఈ పుణ్య రోజున భక్తులు వేలాదిగా వైష్ణవాలయాలకు తరలివస్తారు.

- ఉత్తర ద్వార దర్శనానికి బారులు
- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు



బద్వేలు అర్బన్: శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



బి.మఠం: శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి హారతిస్తున్న శ్రీ వెంకటాద్రిస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. చెన్నకేశస్వామి, మహాలక్ష్మీదేవి మూలవిరాట్‌లను నూతన పట్టువస్త్రాలతో, వెండికవచాలతో, గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. బొల్లవరంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవిభూదేవి సమేత ప్రసన్నవేంకటేశ్వరునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఉంచి ప్రాకారోత్సవాన్ని గోవింద నామస్మరణల మధ్య నిర్వహించారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరునికి, స్వామి చెల్లెలు లలితాదేవికి ప్రత్యేక పూజలు అలంకరణ చేశారు. హౌసింగ్ బోర్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు, అలంకరణ చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

**వజ్రపుచీరలో దర్శనమిచ్చిన కన్యకాంబ**

స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం వాసవిమాత వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా వజ్రపు చీర, కిరీటధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకం, కుంకుమార్చనలు, పుష్పార్చన వంటి పూజాకార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు**

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో స్వాములకు అర్చకులు ప్రత్యేకంగా అలకంరించి పూజలు చేశారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా వెళ్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను దర్శించుకున్నారు.

పోరుమామిళ్ల: మండలంలోని వైష్ణవ ఆలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. కాలువకట్ట తిరుమలగిరిపై వెలసిన శ్రీ గోదాదేవి, లక్ష్మీదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

**శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో..**

పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జామునుంచే స్వామిని దర్శించుకునేందుకు పోటెత్తారు.

**భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు**

మైదుకూరు : మైదుకూరులో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు చేరుకుని ఉత్తర ద్వార దైవదర్శనం చేసుకున్నారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీమాధవరాయ స్వామి ఆలయంలో భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లె తిరుమలనాథ స్వామి ఆలయంలో మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పోటెత్తిన భక్తులు**

బద్వేలు అర్బన్ : పట్టణ ప్రజలు శుక్రవారం ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణానికి సమీపంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలిసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో, నెల్లూరురోడ్డులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడ వాహనంపై స్వామివారు ఉత్తరద్వార దర్శనమిచ్చారు. అలాగే సిద్దవటంరోడ్డులోని ఫైర్ ఆఫీస్ వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో, తెలుగుగంగకాలనీలోని అనంతపద్మనాభస్వామి ఆలయాలలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా ఆలయాల చైర్మన్లు బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, మెంటా అశోక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దువ్వూరు (చాపాడు): మండల వ్యాప్తంగా శుక్రవారం వైకుంఠ ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత దువ్వూరులోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్తర ద్వార దర్శనం చేయించారు. ఇదే క్రమంలో గుడిపాడులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : వజ్రపు చీరలో వాసవీమాత

**వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం**

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వీరబ్రహ్మక్షేత్రంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీసమేత శ్రీ విష్ణుమూర్తి అవతారంలో శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అంతకుముందు స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి జ్యేష్ఠ పుత్రుడు శ్రీ వెంకటాద్రిస్వామి ప్రథమ హారతి ఇచ్చారు. అనంతరం శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను శేషశయన వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. పెద్దమఠం నుంచి స్వామి, అమ్మవారు చిన్న మఠంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత గ్రామోత్సవం కందిమల్లాయపల్లెలో అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమాలను మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ పర్యవేక్షణలో మేనేజర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి వారి శిష్యులు, ఉభయదాతలు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి



మైదుకూరు : ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథ స్వామి



రాజుపాళెం: వెల్లాలలో పూజలందుకుంటున్న ఉత్సవ మూర్తులు



పోరుమామిళ్ల: ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



చాపాడు: దువ్వూరులో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

# అభివృద్ధే స్వచ్ఛభారత్ మిషన్ ధ్యేయం

**మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున**



శిక్షణలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్లు

ప్రొద్దుటూరు : మానవ వనరుల అభివృద్ధే స్వచ్ఛ భారత్ మిషన్–2 ధ్యేయమని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున తెలిపారు. ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛభారత్ మిషన్–2పై రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇందులో ప్రొద్దుటూరు, చిత్తూరు మున్సిపల్ కమిషనర్లను ఎంపిక చేయగా, ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన శుక్రవారం సాయంత్రం తిరిగి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత దేశానికి సంబంధించిన ఆయా రాష్ట్రాల మున్సిపల్ కమిషనర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, మొత్తం 40కి గాను 34 మంది హాజరయ్యారన్నారు. స్వచ్ఛభారత్ –1లో భాగంగా ఓడీఎఫ్‌ను 2014 నుంచి 2019 వరకు అమలు చేశారన్నారు. ప్రస్తుతం స్వచ్ఛ భారత్–2 ద్వారా చెత్త నుంచి సంపద తయారీకి సంబంధించి అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

# తెలుగు సాహితీయాత్రలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న హనుమంతరావు

గోపవరం : తెలుగు భాషా సాహితీయాత్రలు జయప్రదం చేయాలని ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం, రాష్ట్ర తెలుగుభాష వికాస ఉద్యమం సంయుక్త ఆధ్వర్యంలో త్వరలో ఈ సాహితీ సాంస్కృతిక పర్యాటక యాత్రలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు హనుమంతరావు తెలిపారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని మొల్ల మందిరం వద్ద ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న తెలుగుభాషకు ఇది సంధికాలం అన్నారు. మాతృభాష వికసించడానికి అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

# ముందే సంక్రాంతి



భోగి మంట వేసి సంబరాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ వెంగమాంబ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ పుల్లపనాయుడు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో సంక్రాంతి ముగ్గులు, భోగిమంటలు, గొబ్బెమ్మలు ఆడే కార్యక్రమాలు చేపట్టారు. తెలుగింటి ఆడపిల్లల వస్త్రధారణ, పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహించారు. భోగి పండుగ, మకర సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను పుల్లపనాయుడు వివరించారు. ఈ వేడుకల్లో పాఠశాల హెడ్ మాస్టర్ దిలీప్ కుమార్, నాగలింగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు**

కలసపాడు : స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను కులమత భేదం లేకుండా ఆనందంగా జరుపుకుంటారని తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్‌ఎం చిత్తా ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సంప్రదాయబద్ధంగా భోగిమంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సంప్రదాయ వంటకాలు విద్యార్థులు వండి అందరికి రుచి చూపించారు. సంక్రాంతి పండుగ విశిష్టతను కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ వివరించారు.



వివిధ వేషధారణలో సెయింట్ ఆంటోనీస్ పాఠశాల విద్యార్థులు

### మినీ గోకులం షెడ్లతో పాడి రైతులకు లబ్ధి

చాపాడు: మినీ గోకులం షెడ్లతో పాడి రైతులకు లబ్ధి చేకూరుతుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ పేర్కొన్నారు. మండలంలోని మడూరు పంచాయతీలో మూడు, అన్నవరంలో రెండు, చియ్యపాడు, బద్రిపల్లె, అల్లాడుపల్లె, నాగులపల్లెలో ఒక్కొక్కటి, చాపాడులో రెండు, ఎస్.ఓబాయపల్లెలో రెండు, పల్లవోలులో రెండు గోకులం షెడ్లను నిర్మించారు. వీటన్నిటినీ శుక్రవారం ఎంపీడీఓ వీర కిషోర్, టీడీపీ మండల అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్స్ అసోసియేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఉద్యోగం లేక, ఆర్థిక ఇబ్బందులతో మహిళా వలంటీర్ గౌతమి ఆత్మహత్య చేసుకుందని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన వలంటీర్ గౌతమి ఆత్మకు శాంతి చేకూరాలని వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ గౌతమికి ఆరు నెలలుగా వేతనం రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందని, ఇదే సమయంలో సంక్షేమ పథకాల ద్వారా కూడా సాయం అందకపోవడంతో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల ద్వారా అప్పు తీసుకుంటే వారి నుంచి వేధింపులు అధికమయ్యాయని, ఈ క్రమంలో వలంటీర్ ఆత్మహత్య చేసుకుని మృతిచెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గౌతమి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి రఫి పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల స్థలం కోసం పోరుబాట



ప్రొద్దుటూరు : తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



బద్వేలు అర్బన్ : తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



మైదుకూరు: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : అర్హులైన పేదలందరికీ రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బి.రామయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినా ఇంత వరకు ఇల్లు లేని పేదల సొంతింటి కల సాకారం చేసేలా చర్యలు చేపట్టలేదన్నారు. పట్టణంలో వందలాది ఎకరాల భూమి ఆక్రమణకు గురైనా ఎలాంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదన్నారు. ఫలితంగా సుదూర ప్రాంతాల్లో భూమి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఏటి పోరంబోకు భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే ఆగమేఘాల మీద రెవెన్యూ, రిజర్వ్ ఫారెస్టు అధికారులు పోలీసుల సహాయంతో కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సీపీఐ ఏరియా సమితి సభ్యులు మచ్చ శ్రీను, వీరయ్య శెట్టి, వై.హరి, ఎల్లయ్య, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, సహాయ కార్యదర్శి రాహుల్ పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్లులేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలంతో పాటు వ్యవసాయ భూమిని ఇచ్చి తమ హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద అర్హులైన లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని కూటమి ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా ప్రచారం చేశారని, అయితే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసగించారని అన్నారు. సీపీఐ మండల కార్యదర్శి ఇమ్మానియేల్, పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు నాగరాజు, మహిళా సంఘం ఏరియా కార్యదర్శి విజయమ్మ పాల్గొన్నారు.

మైదుకూరు : పట్టణంలోని ఇళ్లు లేని పేదలలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, బంజరు భూములు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కడప రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి మార్కెట్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. అయితే కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణం పనులను చేయడం లేదన్నారు. మైదుకూరు మండలంలోని నంద్యాలంపేట, విపురాపురం, రేకులకుంట ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయని వీటిని రాజకీయ నాయకుల అండతో వందల ఎకరాలు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఆక్రమణకు గురైన భూములను ప్రభుత్వం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఐ నాయకులు శీను, షావలి, పీరయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికుల రిలే దీక్ష

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు ఒక రోజు రిలే దీక్ష చేపట్టారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ గతంలో సమ్మె సందర్భంగా కార్మికుల జీతాలు పెంచారు కానీ, వారికి సంక్రాంతికి బోనస్‌గా రూ.1000 ఇవ్వాలని జీఓ ఇచ్చారన్నారు. అది కూడా ఒక ఏడాదికే వర్తింపజేశారని, దానిని ప్రతి ఏడాదికి వర్తింపజేయాలన్నారు. రిటైర్మెంట్ అయితే రూ.75వేలు ఇస్తామన్నారే కానీ జీఓ విడుదల చేయలేదన్నారు. కార్మికులకు న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దేవానందం, సావి దాసు, కె.మేరి, జ్యోతి, సుధాకర్, నీలమ్మ, శ్వేత, జైకుమార్, సురేష్, జి.మేరి రిలే దీక్షల్లో కూర్చున్నారు. ప్రమీలమ్మ, రవికుమార్, గుర్రమ్మ, రమాదేవి, నీతమ్మ, శాంతి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

# పసిడిపురి.. వాణిజ్యాభివృద్ధి సిరి

- రాయలసీమలోనే ప్రఖ్యాతిగాంచిన పట్టణం
- వస్త్ర, బంగారు వ్యాపారానికి ప్రసిద్ధి


కొర్రపాడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన క్లాత్ మార్కెట్


విద్యుత్ కాంతుల్లో మైదుకూరు రోడ్డు


ప్రత్యేక అలంకరణలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి


శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం

ప్రొద్దుటూరు: వాణిజ్య కేంద్రమైన ప్రొద్దుటూరుకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఏ జిల్లా వారిని అడిగినా ప్రొద్దుటూరును ఇట్టే గుర్తిస్తారు. విస్తరించిన వ్యాపార అభివృద్ధే ఇందుకు కారణం. జిల్లాలో కడప తర్వాత ప్రొద్దుటూరు పెద్ద పట్టణం. పూర్వ నుంచి బంగారు వ్యాపారం, వస్త్ర వ్యాపారం, నూనెల వ్యాపారం, రైస్‌మిల్లులు, కాటన్ మిల్లులకు ప్రొద్దుటూరు ప్రసిద్ధి. 50 ఏళ్ల క్రితం నుంచి ఇక్కడ వివిధ రకాల వ్యాపారులు విస్తరించాయి. వేలాది మందికి వ్యాపారాలు జీవనోపాధిగా మారాయి. రోజు కూలీల నుంచి ఉద్యోగుల వరకు వీటిలో పనిచేస్తున్నారు. ప్రత్యేకించి బంగారు, బట్టల కోసం రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి రావడం ప్రత్యేకత. ఆంధ్రతోపాటు ఇతర రాష్ట్రాలకు వ్యాపారాలను విస్తరింపజేశారు. హోల్‌సేల్ వస్త్ర వ్యాపారులు ఇతర జిల్లాలకు సరుకును రవాణా చేయడం జరుగుతోంది. ట్రాన్స్‌పోర్టు రంగం ప్రొద్దుటూరులో ప్రముఖంగా విస్తరించింది.

**విద్య, వైద్యం అభివృద్ధి**

ఇటీవలి కాలంలో ప్రొద్దుటూరు పట్టణం విద్య, వైద్య రంగంలో అభివృద్ధి సాధించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ, శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల ఏర్పాటు చేశారు. వాగ్దేవి, సీబీఐటీ, ఎస్ఆర్ఐటీ, గౌతమి ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు రెండు ఫార్మసీ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఇక్కడ వెలిశాయి. 8 డిగ్రీ కాలేజీలు, 12 జూనియర్ కాలేజీలు, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు నడుస్తున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. వీటి ఆధారంగా పీజీ హాస్టళ్లు కూడా విస్తరించాయి. వైద్య రంగం పట్టణంలో నానాటికి విస్తరిస్తోంది. అన్ని రకాల వ్యాధులకు వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నెలకొల్పి మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అత్యవసర సమయాల్లో గుండెకు స్టంట్లు వేస్తున్నారు.

**నిర్మాణ రంగానికి ప్రత్యేకత**

నిర్మాణ రంగానికి ప్రొద్దుటూరు ప్రసిద్ధి గాంచింది. గత పదేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించింది. సాధారణ వ్యాపారుల నుంచి ప్రముఖ నేతలు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నారు. పట్టణానికి చుట్టూ వెంచర్లను ఏర్పాటు చేశారు. పట్టణ శివారులోని వెంచర్లలో రూ.కోట్లు వెచ్చించి అత్యాధునికంగా నూతన భవనాలను నిర్మిస్తున్నారు. ఈ భవనాలు ఇంద్ర భవనాలను తలపిస్తున్నాయి. నిర్మాణం రంగం ఆధారంగా స్టీల్, సిమెంట్, ఇంటీరియల్ డిజైన్స్, ఫర్నీచర్స్, గ్రానైట్, మార్బుల్, టైల్స్, ప్లైవుడ్, పెయింటింగ్, విద్యుత్ సామగ్రి వ్యాపారాలు అభివృద్ధి చెందాయి. ఈ రంగం ద్వారా నిత్యం వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు ఇక్కడ పని చేస్తున్నారు.

- ట్రాన్స్‌పోర్టు రంగం విస్తరించింది. అనేక రాష్ట్రాలకు ఇక్కడి నుంచి ట్రాన్స్‌పోర్టు వాహనాలు నడుస్తున్నాయి. అలాగే ఇటీవలి కాలంలో ప్రైవేటు బస్సుల సంఖ్య విపరీతంగా పెరిగింది. రోజు ఇక్కడి నుంచి సుమారు 100 బస్సులు వివిధ రాష్ట్రాలకు వెళుతున్నాయి.
- పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ఇటీవలి కాలంలో మాల్స్ విస్తరించాయి. కార్పొరేట్ రంగానికి చెందిన డీమార్ట్, రిలయన్స్, మోర్, బి.మార్ట్, విశాల్ మార్ట్‌తోపాటు లోకల్ సూపర్ మార్కెట్లు వెలిశాయి. వస్త్రా వ్యాపారానికి సంబంధించి వస్త్రభారతి, వివేకానంద క్లాంట్‌లు, బాలాజీ క్లాత్ మార్కెట్, న్యూ వస్త్రభారతి క్లాత్ మార్కెట్లు, న్యూ వివేకానంద క్లాత్ మార్కెట్, శివశంకర్ కాంప్లెక్స్ ఏర్పాటయ్యాయి. ఇటీవలి కాలంలో కొత్త రెస్టారెంట్లు, కేఫ్‌ల సంఖ్య విపరీతంగా పెరిగింది.